# ద్వితీయాలు

శ్రీ కందుకూరి లింగరాజు

భార్య మహాలక్ష్మి పోయిన మూడో నెల తిరగకుండానే, రామారావుకు విధురత్వంలోని బాధలు, కష్టాలు తెలిసివచ్చేయి అని తోడుగా కాస్త పెద్దవయస్సు వాళ్ళైనా ఆసరా లేకపోవడంలోటి, అది కొండంతై గజిబిజి చేసేసింది. ఏం చెయ్యాలి అన్న ఆవేదన వెన్నుముట్టింది.

ఆ పన్నెండోరోజు దాటకుండానే దూరపు బంధువుల్లో తలనెరసినవాళ్ళు "భలానావారి సంబంధం వుంది. పిల్ల కొంచెం ముదురుకేఅయినా" అనో "వయస్సేమాత్రం. ఇంకా నలభై దాటలేదు. ద్వితీయ వివాహం చేసుకో"అనో—ఇల్లా సలహాలు, సమీకరణలు ఇచ్చారు. అప్పుడు ఎంతో చికాకు కోపంవచ్చింది. కొందరికి కరుకుగాను, మరికొందరికి కోపపుపాటితోనూ సమాధానం చెప్పేడు.

ఇప్పుడు సింహావలోకనంగానే చూస్తే వాళ్ళు చెప్పింది బేసబబుగా లేదనిపించింది. అందులో అనుభవం లోకజ్ఞానం మిళాయించి వున్నాయి అనీ తట్టింది. సంపాదించిన ఆస్తి, కట్టినఇల్లు ఈనాటికీ జీతం తెస్తున్న ఉద్యోగం ఇవన్నీకూడా, ఇల్లా ఒంటరిగా నువ్వు వుండిపోతే బూడిదలోపోసిన పన్నీరే అన్నట్టు తోచేయి. దాంతో తను ఎంతఏకాకిగా ఉండిపోయానా అని గుబగుబలాడిపోయేయి గుండెలు.

అయినా అవన్నీకూడా తాత్కాలికాలు అనుకుని చాలాసార్లు 'ఏమిటీ చండాలపు తలంపులు' లక్ష్మికి అన్యాయం చెయ్యగలనా అనుకున్నాడు. దాంతో......

అప్పుడు, ఆ పన్నెండు ఏండ్రకితం ప్రథమంగా, లక్ష్మి తనూ, ఈ ఇంట్లో కాపురం పెట్టేరు. ఒక పూర్ణ పుష్కరం గడిచిందని తెలియకుండానే జరిగిపోయేయి వత్సరాలు ఒకదాని వెనుక ఒకటి. ఆ సంవత్సరాల వెనకబడడం, అటు, ఇటు లక్ష్మిలోవున్న పూర్ణ సరస్వతీ ఝరి బయటపడి, తను తన్మయత్వం చెందడం కూడా జరిగేయి.

లక్ష్మి తను, తనే లక్ష్మిఅయి పోయేరు. సంసారమూ స్థాయి పెంచుకుంది. వటుబింతంతై అన్నవతులా పెరిగి, ఇల్లూ, వాకిలీ పొలం బుట్రా, వగైరాలు చారికలు అయిపోయేయి.

ఇదేబాధగావుండేది. లక్ష్మిలోకానికి, భౌతికంగా లేదు. కాని తనకి ఆత్మవతుగా అయి అమరత్వం వహించినట్టే ఇప్పటికీ వుంది.

ఈ వాతావరణంలో, ప్రతీ అరమరికా కూడా ఆమె హాయులులోను, చేతనంలోనూ తీగలు సారించుకున్నాయి. మరచిపోలేని మయూరాసనాలై పోయేయి.

ఈ భౌతిక, ఆధ్యాత్మిక సమ్మేళనం అతీతం అయ్యింది. రోజులు గడిచేకొద్ది దాంతో సతమతమై పోయేడు. సముద్ర మథనం అన్నట్టే హృదయం ఘూర్ణితం అయ్యింది.

ఏవిషయంలో ఎల్లా వున్నా, ఉండింకే, ఓరోజు చీమకేనా చెప్పకుండా ఆ వితంతు శరణాలయానికి వెళ్ళి, తన వయస్సుంతే రమారమివున్న రమణమ్మను పెళ్లి చేసుకుని తీసుకువచ్చేడు రామారావు.

ఇరుగుపొరుగులు ఆశ్చర్యపడ్డారు మిత్రులు తెల్లబోయేరు.

పేపర్లల్లో సంఘసంస్కరణ అన్నట్లు పేర్లు పడ్డాయి.

ఓనాటిసాయంత్రం, తెలిసినవాళ్ళకు, మిత్రులకు, ఇరుగుపొరుగులకు, విందుచేసి, పత్నీ, సమేతంగా పరిచయం అయిపోయేరు రామారావు, రమణమ్మను. ఇదినాంది.

*　　　*　　　*

మొదట్లో రమణమ్మ, పరిస్థితులు అవగాహన అయ్యేవరకు కూడా అణగి మణగి, అవలిస్తే ప్రేవులు లెక్కపెట్టే రీతిగానే ఇంట్లో వుండిపోయింది. చూచాయగా అన్నట్లుకాక, ఆమూలాగ్రంగానే

గతించిన చరిత్రలన్నీ, క్రొత్తగా పాతు అన్నట్లు చెప్పేడు. ఆ చెప్పడంలో మరిచిపోతానేమో అన్నట్లు, ఒక్కొక్క విషయాన్ని టీకాతాత్పర్యాలతో వివరించేవాడు.

రమణమ్మ వింటూనే సమయానుకూలంగా మెప్పులు పడేస్తూ వుండడం రామారావుని అందలంలో కూర్చోపెట్టేసింది.

దీనికి తోడు రమణమ్మ కాస్త వద్దూ పాడుకూ వుండడం, గుండ్రటి ఊరించేకళ్ళు, ఎర్రటి ఛాయ ఇవన్నీ కలసి, తను లక్ష్మిని మర్చిపోడానికి జీవితంలో ఇంకో పత్రం త్రిప్పడానికి మత్తు కల్గింది. ఆ మత్తులో లోకంలాగే దాసోహంవరకూ కూడా వెళ్ళింది, రామారావు స్థితి.

ఆరోజు ఆఫీసునుండివచ్చి బట్టలు మార్చుకుంటూంటేనే రమణమ్మ "మహాలక్ష్మమ్మకు సంసారం దిద్దుకునే తెలివితేటలేవటకా?" అంది.

చురుక్కుమని చూస్తూ "ఎవరన్నారు?"

"ఇంటి స్థితి చూస్తే పుట్టిన గుడ్డుకూడా చెపుతుంది."

"అంత అధ్వాన్నంగా వుందా?"

"తెలియనట్లు అల్లా అంటారేమిటి. ఇరుగుపొరుగు కోడై కూస్తుంటే. ఒక్కనాడైనా సుఖంగా మీరుండలేకపోయేరుటకా?"

పుణ్యావఘులన్నీ పొంగి పొరలిపోయేయన్న దుఃఖం వచ్చింది. నిరుత్తరుడే అయ్యేడు.

దగరసా ఒస్తూ పొదివిపటుకుని "ఎంతగా కుమిలి క్రుంగిపోయేరో మీరు. నేను వున్నానుగా ఇప్పుడు... ఆ గతించిన..." తక్కున ఆగిపోయింది. దాంతో పొదివి పట్టుకున్న చేతులూ విడిపోయేయి. క్షణకంలోనే ఆవిడ కళ్ళు చెమర్చడం, నెమ్మదిగా కన్నీటి బిందువులు కారడం ... వుండలేక మొఖంలోకి చూడలేక, గబగబా వంటింట్లోకి వెళ్ళిపోయింది రమణమ్మ.

తెల్లబోయేడు రామారావు. ఖంగారుగానే వెనుక వెళ్ళేడు. ఆవిడా వంటింటింలోకి వెళ్ళి "మిరపకాయలు ఎండవెయ్యాలని డెక్కపటిన కంఠంలో అంటూనే, చేటలో పొయ్యడం, ఆ ఘాటుకు తనకి తుమ్ములు రావడం జరిగి, సావిట్లోకి వచ్చేసేడు. కాని గాభరాగా నేవుంది; ఎల్లా అనునయం చెయ్యాలో తెలియలేదు. పైగా కట్టలు తెగినట్లు ఈ ఒక్క ఉదుటలో వచ్చిన ఉప్పెన అర్థంకాలేదు.

తనూ పొదివి తీసుకోలేదేమో అని అనుకున్నా, తప్పిదం కన్పించటంలేదు.

అవ్వాళ అల్లా రమణమ్మ పరాగానే వుండిపోయింది. ఏ పెద్ద దిక్కేనా వుంటే ఏదో దారి, కారణం చెప్పివుండేవారు. అది లేకపోవడం ఈ పరిస్థితి పడగల్లివాన లాగే తట్టడం అయ్యింది.

ఆ సాయంత్రం, మల్లెపూలు, పాలకోవాకూడా తెచ్చినవి, తను రోజూలా ఆదరించలేకపోయేడు.

* * * *

మర్నాడు రాత్రి భోజనాల దగ్గర కూర్చున్నపుడే "నిన్న ఏదోలా మనస్సు చివుక్కుమంది. మిమ్మల్ని చాలా కష్టపెట్టేను కాదూ?" ఎంతో ఇదై పోతున్నట్లుగా అడిగింది.

తెల్లబోయేడు; తనే, కారణం ఆరాతియ్యాలని సతమత మవుతున్నాడు, దారి తెలియక.

"ఒక్కొక్కసారి కొన్ని విషయాలలో ఎంత మర్చిపోదామనుకున్నా మర్చిపోలేను. అందులో ప్రత్యేకంగా కొన్ని ఘట్టాలు" అంది యథాలాపంగా.

గుండెలు ఆగినంతపనైంది రామారావుకు. ఓసారి జాలి, మరోప్రక్క ఈర్ష్య కోపం రగిలేయి. ఈ మోడైపోయిన చెట్టుకు నీరుపోసి, చిగురింపచేసినా, మనస్సు ఆ గత స్మరణల్లోనే తిరిగి ఆ వాతావరణాన్నే కల్పించుకుంటూ. దాన్నే మననం చేసుకుని, ఈ పచ్చచిగురుల్లో రంగులుకల్పించడం సహజం అనుకున్నా, చెసినత్యాలగాను కృతజ్ఞత లేకుండా వుండడం కోపాన్ని ఉరకలు వేయిస్తోంది.

రవులుతున్నపుడే "మనుషులకు కృతజ్ఞత తాలికట్టింది. దాన్ని ఛేదిస్తే మృగప్రాయులవుతారు. దీనివల్ల గమ్యస్థానం ఛిద్రం అవటానికి ఆస్కారముంది" అన్నాడు.

రమణమ్మ అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ "నేనేం చేసేను" అంది. అందులో నోట్లోపటికి బెల్లంకూడా కరగదన్నంత అమాయికత్వం చూపించేసింది.

"ఎవరూ ఏంచెయ్యలేదు" విసురుగానే అన్నాడు. గబాగబా వ్యంజనాలన్నిటినీ ముట్టుకోకుండా. అయిందయిందన్నట్లే ఉత్తర ఆపోసనం పట్టేసేడు.

మొఖం జేవురించుకునే, "అయినా అంతే!" అనేసింది రమణమ్మ అవ్యక్తంగా.

"అందుకే దేవుడు తీసుకువెళ్ళి పోయేడు" అంటూ సావిట్లోకి వచ్చేసేడు.

వెనువెంటనే రేగిన తేనెపట్టులా తనతజీం ఎంత అధోగతిలోకి లాగపడిందో అన్న కుమిలింపు పుములుకుంది. వూహించిన సుందరి. ఎంతక్రూరంగా తలంపులన్నీ తన ప్రథమభర్తమీద పెటుకుని తన్ని తన చర్యల్ని, ఉన్నతిని, ప్రతిష్ఠని ఒక్కటేమిటి సర్వస్వం, పోలిక చేసుకుని, రూపాన్ని నిర్దేశించి, సంసారం సాగించడం అన్నంత, నైతికపతనం ఏదీ లేదేమో అనిపించింది. తాను ఒక ద్రష్ట అయివుండడం తప్ప—ఏమృణ్మయ పాత్రలాగో.

లక్ష్మి చెప్పిందా తన్ని ద్వితీయం చేసుకోమని. లేనే లేదు. అందుకేజీవితం ఇల్లామండి, బుగ్గవలేని స్థితిలో కుళ్ళిపోవలసి వచ్చింది అన్న భావన తట్టింది.

పనేం చెయ్యకలడు? ఇదే నిర్ధారణ అవటం లేదు. విడిచిపెట్టేస్తే, విధుర జీవితం తిరిగి తాండవం. తిట్టుకొడితే మానవత్వానికి సమాధి. మార్పుకల్గిన దారి? అదే కన్పడలేదు.

ఏది ఎల్లావున్నా, ఆ సంపుటాలకి టీక వ్రాయవలసిన బాధ్యత తనమీదనే వుంది. తనే భరించాలి. తను మార్గం చూపించుకోవాలి. ఎంచేతనంటే రమణమ్మ జీవితం నిర్ణీత సరిహద్దుల్లోనే అడ్డగీతలైంది. మానవస్వభావరీత్యా అది సంకుచితమై ముడుచుకుంది. దాన్ని పాముల బుట్టలా తను ఆవృతం అయి సరిదిద్దాలి.

సామానులన్నీ సర్దినకొకత్ సాగిన త్వరిత గమనం, రమణమ్మని పడకటెంట్లో పెట్టేసింది. నెమ్మదిగా లేచి వెళ్ళేడు. బోర్లాపడుకుని, చెదిరిన కబరీభారంలోనుంచి, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఎగుడుదిగుడులవుతున్నాయి. దుఃఖంలో స్వరజితులే అయ్యింది భావన.

జాలి ముమ్మరమై "రాణీ" అంటూనే పొదివి తీసుకున్నాడు. బావురుమంటూ గుండెల్లోకి దూరిపోయి, చొక్కామీద కళ్ళు అద్దుకుంది.

"ఆయన అంతక్రూరంగా వుండే వాడా?" అన్నాడు.

తలూపింది.

"నువ్వు చాలా కష్టపడివుంటావు. ఎక్కువగా బాధించేవాడు కాబోలు."

"ముక్కుమీద వుండేది కోపం. రుస రుసలాడుతూ వుండేవారు. అప్పుడప్పుడు..." మరింతగా తల దూర్చేసింది.

"ఎన్ని కష్టాలుపడ్డావు. నువ్వుచాలా అమాయకురాలివి. ఇంకొక ఆడది అయితేనా..."

"నేనూ అల్లాగే అనేదాన్ని" చువ్వన లేచి అంది, హుషారులో.

"అవన్నీ నేను మర్చిపోయేటట్లు చేస్తాను నిన్నే ...నిన్నే..."

"ఎంత మంచివారు..." అంటూనే బుగ్గలు గోముగా నిమిరింది. శరీరాన్ని తన వేపు లాక్కుంది...

ఆ రాత్రి...

లక్ష్మి, నవ దుర్గల్లాపహారా కాసేసి కంటిమీద కునుకుపడనివ్వనేలేదు. మైకంలో 'లక్ష్మి' అన్న అంతఃకల్లోలంలో ఐక్యమైపోయేడు...

'ఛా' అనుకున్నాడు..."నీ స్థితేమిటోయ్. వెర్రిపుల్లాయి" అంటూ ఆత్మ ఎత్తికుదేసింది. చెమటలు క్రమ్మేయి ఆపాదమస్తకం రామారావుకి.

*　　　*　　　*

ఓ నిర్ణీత పంథా ఏర్పడిందని రామారావు సంతోష పడ్డాడు. ఇదే ఆచరణలో పెడితే, స్వర్గానికి నిచ్చెనలు వేసెయ్యడం అవుతుందని వుకుకులతోనే ఆచరణలో పెట్టేడు. ఈ ఆచరించడం అన్నది ఒక్కొక్కసారి అతీతాల్లోకి వెళుతుందేమో అన్న ధ్యాసే లేకుండా అయిపోయింది.

రమణమ్మకి అనునయంగా, అన్ని సౌకర్యాలు, సంతోషాలు సమకూర్చాలన్న ఉద్దేశ్యం అంచలం ఎక్కింది. అంతవరకూ తియ్యని, లక్ష్మి పెట్టెతీసి, తను కొన్న, పెళ్ళినాడు పెట్టిన, పట్టుచీరలన్నీ బయటకు తీసేడు. నెలకో చీర చొప్పున కొన్నవీ ఉండిపోయేయి అందులో. పైగా పిల్లతోపాటు, కట్టువంకీ, కాసుల పేరు, నాల్గు జతల మిరియాలగాజులు, సానుతాడు కూడా పైన పెట్టేడు.

తీసేసన్న పేరేకాని, ఏ విధంగా రమణమ్మకి ఇవ్వాలన్నది సందిగ్ధం అయ్యింది. ఏదో పనిమీద ఆ గదిలోకి వచ్చిన రమణమ్మ, ఇవన్నీ చూచి, తెల్లబోయి గోడకు చేర్లాపడింది.

నవ్వేడు. "అవన్నీ నీవే రమణా!" అన్నాడు. దేవుడికి కృతజ్ఞత చెప్పుకుంటూనే.

"నావా!" గొంతుకలోంచే అంది.

"అవును. ముమ్మాటికి నీవే. నీవి కాకపోతే ఇంకెవరివి?" అన్నాడు, కాని గుండెలు ఓ సారి ఆగి మళ్లీ స్పందనం ప్రారంభించినట్లయ్యింది.

రమణమ్మ వెనకటి జీవితంలో పసుపుతాడు తప్ప లేని మైకంలో, ఇవన్నీ ఎదురుగా తిరిగితే, స్త్రీ సహజపు కోర్కెల్లోనే ఒక్కొక్కటే త్రిప్పి, సృజించి చూచింది. దాంతోనే క్రమంగా ఆయనంటే ఆరాధన క్రమ్ముకుంది. "నీకోసం" అన్న వాక్యం వేదపారాయణం అయిపోయింది. దగ్గరగా వస్తూనే, కళ్లు చెమ్మగిలగానే భుజాలమీద చేతులు వేసి చిరునవ్వు నవ్వి సిగ్గుపడిపోయింది.

ఓ చేత్తో పొదివిపట్టుకుని ఒక్కొక్కనగే మెళ్లో చేతికీను, పెట్టేడు. తొడుగుతున్నప్పుడు కిలకిల్లాడిపోయింది రమణమ్మ.

"ఇప్పుడే వస్తాను" అంటూనే ఆకుపచ్చ పట్టు చీర, ఆరుద్ర పురుగురంగు వెల్వెట్ జాకెట్టు పట్టుకు తుర్రుమంది.

ఒక్కసారి నిట్టూర్పుగానే గాలి విడిచేడు రామారావు. గది మధ్యలో వట్టివేళ్లవాసన, మల్లిపూలు విచ్చిన సౌందర్యం దాచుకున్న అన్నపూర్ణలా పొగలు చిమ్మిన అత్తిరుపుల్లలు, తలకు రాచుకున్న జాజిపువ్వులనూనె, ఆవృతం అయిపోయేయి.

మైకం క్రమ్మనే క్రమ్మింది. నీరూరిన కళ్లల్లో మసగ్గానే, ఆకుపచ్చచీర, ఆరుద్రపురుగురంగు జాకెటు తల్లో మల్లెపూలు, వట్టివేళ్ళ అత్తిరువు, చెవులచివళ్ళ కటువంకీ అందలం, కాసులపేరు మెరుపు...జీవం పోసుకుని, కాటికకళ్లమధ్య, తోపు కుంకపు మెరుపులో మళ్లీజీవం పోసుకుంది.

కనుమరుగు చేసుకునేటప్పటికే రమణమ్మ ఎదురుగా అదే ఆకారంలో, వెయ్యివసంతాల నవ్వుతోనే వచ్చేసింది.

తలుకోలేక పోయాడు, తబ్బిబ్బు అయ్యాడు రామారావు.

చెవులో చెవిపెట్టినట్టే "ఎల్లా వున్నాను" అనిగునిసింది.

"లక్ష్మిలా వున్నావు" అప్రయత్నంగానే వచ్చేసింది మాట.

ఛెళ్ళున చెంపెటిక ఇచ్చినట్టే రమణమ్మ తూలిపడి జేవురింపులో "ఆ చచ్చిపోయిన ఆవిడమీద అంత మమకారం, ఆరాధనవుంటే నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు! చేసుకుని దాన్ని తలచుకుంటూ, మనసా వాచా దాన్ని ఆరాధిస్తూ, దాన్నే నాలో ఆరాధించుకుని, నన్ను సమాధికట్టడం ఎందుకూ? చిత్రవధ చేయడము ఎందుకూ. ఇందుకా దానికి కొన్న నగలు, బట్టలు నాకిచ్చి, నన్ను నేనుగా లేకుండా, దాని తొడుగులలో జీవించమనడానికా ఇస్త.. నాకేం అక్కర్లేదు... వెధవ నగలు...దరిద్రపు కూడు..." అంటూనే ఒక్కొక్కటే తీసేసి విసిరింది. ఆఖరుకు ఖండువా ఓటి చుట్టబెట్టుకుని, చీర, జాకెట్టు కూడా మొహంమీద కొట్టి వెళ్ళిపోయింది.

కదలిక లేని కొయ్యే అయ్యాడు రామారావు. చైతన్య రాహిత్యంలో మనస్సు వికలమైంది.

గటిగా ఏడ్వాలనిపించింది. ఒక్కొక్కటి ఏరి, మడతపెట్టి, నిర్లిప్తంగానే పెట్టెలో పెట్టేడు. అవ్యక్తముగా అవి కన్నీళ్లతో మాలిన్యం కడుక్కున్నాయి.

"లక్ష్మీ! నువ్వు చెప్పు నేనేం తప్పుచేసేను" అని భావురుమని పోయేడు.

కర్తవ్యం ఏమిటో తెలియక ఖండువా భుజం మీద వేసుకుని బజారునపడ్డాడు.

గుమ్మం మెట్లు దిగినప్పుడే పెట్టె తీసిన శబ్దం. విసురుగా గిన్నెల చప్పుడు వినిపించింది.

'ఎందుకు ఈ ద్వితీయం అనే వాంఛ కల్గింది' అన్న సమస్య పూర్తిచెయ్యాలనుకునే ఆలోచించేడు. అది తెగా తెంపు లేని సముద్ర మథనం అయ్యింది.

*  *  *

ఆరోజునుండి రమణమ్మ మూతి బిడాయించుకుని, మాటలు మాట్లాడ్డం ప్రారంభించింది. ముభావ సమాధానాల్లో కత్తీ దెబ్బ అన్నట్టే వుంది ఎడముఖం పెడముఖాల్లో.

'నాలైగు రోజులు ఇల్లంతా కిలకిలలు లేక నిశ్శబ్దం అవడం, రామారావుకి చీమలు కుట్టినట్టే అయ్యింది. నోరారగ మాట్లాడాలన్నా అభిజాత్యం అడ్డుపడింది. తీరా ఆలోచిస్తే 'తప్పే లేదు' అని తట్టినా నోరు ఆడకుండా మొరాయించింది. ఆ నాల్గు రోజుల ముందే ఇంట్లో వున్న లక్ష్మి నగలన్నీ కూడా, బజారుకు తీసుకు వెళ్ళి, పలకసర్లు, బ్రిడ్జిగాజులు, జాజిమొగ్గల నెక్ లేస్ క్రింద మార్పుకు ఇచ్చేసేడు.

ఒక్కసారి 'ఎంత క్రూరంగా లక్ష్మిని బలిపెట్టేసేవు' అన్న తలంపు క్రమ్మితే కళ్ళుమూసుకున్నాడు. 'తనే మారాలి' అన్న భావనలో. ఇవన్నీ రమణమ్మకు చెప్పడంకాని, వివరించడంకాని జరగనేలేదు. ఇంక చీరలు జాకెట్లు మాత్రం వుండిపోయేయి. వాట్లను ఏం

చెయ్యాలో తెలియలేదు. అదికూడా ఏ మార్పుళ్ళకైనా తీసుకుంటారేమో అన్న భావం, వ్యర్థతలంపులాగే వుంది.

అవ్వాళ భోజనందగ్గరే రమణమ్మ "నేనేం తప్పుచేసేనని ఇల్లా కాల్చుకుతింటున్నారు. నన్ను నన్నుగా జీవించనియ్యమన్నాను అంతే! దానికి ఇంత రాద్ధాంతం చెయ్యాలా? ఈనాల్గు రోజులనుండి ఉరేసుకున్నట్లు వుంది మీరు మాట్లాడకపోవడం... నాకు మీరుతప్ప ఇంకెవ్వరున్నారు..." అనేస్తూనే గుడ్లమ్మట నీళ్ళు గ్రుక్కుకుంది.

శృంగార కావ్యాల్లో ఘట్టాల్లాగే వుంది ఈ నీరెండల సొగసు అనుకున్నాడు.

బుజగింపు చేస్తూనే "మాచెవు నీకోసంగా నేను. నాకు మాత్రం ఎవరున్నారు" అన్నాడు. ఎదురు సవాలుగా.

ఎంగిలన్న నిషేధం లేకుండానే బుగ్గలు నిమిరి ముద్దు పెట్టుకుంది రమణమ్మ. కందేలయ్యేడు రామారావు వినూత్న అధ్యాయంలో ఆరాత్రి

చెవుల్లో చెవిపెట్టి ఒక్కపుస్తిల తాను సవరిస్తూనే, వట్టివేళ్ళ గుబాళింపులో, కంసాలి మెరుగెట్టి ఇచ్చిన నగలన్నీ విపులంగా చెప్పేడు. కువకువమంటూ పావురాయిలాగే గుండెల్లో దూరిపోయింది.

సమాధుల్లో తులసి మొక్కలున్నట్లుగానే అయి సౌందర్యం మాగన్ను పడింది.

* * *

వీధి ఎల్లావున్నా ఇంతగా తనుమారినా రమణమ్మ కొన్నికొన్ని సమయాల్లో బిగుసుకుపోయి, దారిలో పడలేకపోవడం జరుగుతూనే వుంది. తను మాత్రం అడుగడుక్కూ లక్ష్మి ఎక్కడ జ్ఞాపకం వస్తుందో అనుకుంటూనే కట్టుళ్ళల్లోకి పోవడం ఎక్కువై మానసిక ఆందోళనం మిగిలింది.

ఎనిమిదిగజాల గ్లాస్కో పంచకట్టుకుని ఉప్పాడ జరీఅంచు ఖండువాలాల్చీమీద వల్లెవేసుకుని, వీధిలోకి వెళదాం అనుకునే, దగ్గరగా వచ్చిన రమణమ్మని పొదివి తీసుకుని ఎల్లావున్నావని' అడిగితే, చైతన్యం లేని బొమ్మలాగే కళ్ళప్పగించడం వల్లమాలిన కోపం తెప్పించింది. దాంతోనే వివక్షణలేని ఉద్రేకంలో "నన్ను కట్టుకున్నావనే కాని, ఆయన్ని రూపొందించుకుని బ్రతుకుతున్నావు, అంతేగాదూ?" అనేసేడు.

చెప్పలేని బాధలోనే అరచేతుల్లో ముఖం దాచుకుంది.

ఇల్లాంటి దానివి మళ్ళీ పెళ్ళెందుకు చేసుకున్నావు? ఉరెయ్యడానికేనా? ఏం సుఖం ఇద్దామనుకున్నావు? ఇస్తున్నావు?" ఆయనకూడా ఇలాగే బట్టలు వేసుకుని లాలించేవాడు కాబోలు. ఆయనే అనుకుని వచ్చేవు... కాని..."

ఎక్కిళ్ళు ఎక్కువే అయ్యేయి.

"ఎందుకీ మానసిక వ్యభిచారం" జ్రగున లేచింది "మీరు మాత్రం"

"నేనా?"

"అవును. లక్ష్మిలా నన్ను నిర్దేశించుకుంటూ, ఆమే అనుకుని నన్ను నవిలేస్తూ...ఉండటం లేదూ? అది మాత్రం వ్యభిచారం కాదా?"

రివ్వున తగిలింది. ఆలోచనలు ముందడుగువెయ్య లేకపోతే, గుజిలీ పుస్తకం అయిపోయేడు. ఎప్పుడో ఒకప్పుడు ఈ దులుపువస్తుందనుకున్న భయం, పూర్ణమిత్తి అయి రూపొందింది.

నెమ్మదిగానే, అడుగులు వేస్తూనే లేవనెత్తేడు.

తెల్లబోయింది రమణమ్మ, ఈ అనునయానిక్కి.

"అవును. మనిద్దరి జీవితాలు కొన్నాళ్ళు విభిన్న దృక్పథాల్లో నడిచేయి. అందులో శరీరాలు వయస్సుల్లో రంగులు దిద్దుకున్నాయి అవి ఒక్కనాటిలో ఈ నూతన పంథాకి అలవాటు పడవు. కాని ప్రయత్నిస్తే సఫలీకృతులం అవుతామేమో అన్న ఆశవుంది.

దానికి త్యాగం కావాలి. అది జెయ్యడంలో ఉత్కృష్టతవుంది. లేకపోతే పతనం తప్పదు..."

ఇక చెప్పలేక పోయేడు. కళ్ళమ్మట నీళ్ళు కారేయి.

ఇద్దరూ మౌనంలోనే వుండిపోయేరు...

మసగపడ్డ గది మూలల్లోంచి వెదజల్లిన ఆషాఢ మేఘంలాగే నెమ్మదిగా నడుస్తూనే గుమ్మందాటేరు.

అందులో గతానికి సమాధి, భావికి పునాది కుంచెసారించింది, ఆ ఆశల్లోనే, అందాలు సవరించుకందుకు అద్దాలు వెతుక్కున్నారు.

కువకువలాడిన ల్లే వచ్చి గునుస్తూనే "నెల తప్పినట్లు" పొసగిపోయింది.

ఎవరి గుండెల్లో వారికి లక్ష్మి, రాజారావులు క్షణికం మెసలి, మసలి పోయేరు.